క్లుప్తంగా

తైబజార్

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని గౌతంనగర్ డివిజన్ మల్లికార్జుననగర్ ప్రధాన రోడ్డు మార్గంలో శనివారం తైబజార్(వారాంతపు సంత) జరుగుతుంది.

వైద్య సేవలు

అల్వాల్, మల్కాజిగిరి, జవహర్‌నగర్, మౌలాలి ప్రభుత్వ ఆసుపత్రులలో శనివారం చిన్నపిల్లలకు టీకాలు. దంత పరీక్షలు, జనరల్ చికిత్సలు, కంటి పరీక్షలు నిర్వహిస్తారు.

12 మందికి కోవిడ్ పాజిటివ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌లో పాజిటివ్ కేసులు రోజు రోజుకు పెరుగుతున్నాయి. మల్కాజిగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రెండు రోజుల్లో 59 మందికి పరీక్షలు నిర్వహించగా 12 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులు తదితర లక్షణాలతో బాధపడుతున్న వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆస్పత్రి సూపరిండెంట్ ప్రసాద్ సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష



మౌలాలి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మున్సూరాబాద్ కార్పొరేటర్, బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి శుక్రవారం మౌలాలి కార్పొరేటర్ గున్నాల సునీతాశేఖర్ యాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్ నేత తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎన్‌రెడ్డిని గెలిపించండి



చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఉప్పల్: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజవర్గ శాసన మండలి ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దేవసాని బాలచందర్ ఆధ్వర్యంలో శుక్రవారం చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. పాఠశాల అధ్యాపకులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో విఠల్, అలె నరేంద్ర, సంఘీ స్వామి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయురాళ్లను సన్మానిస్తున్న దృశ్యం

రామంతాపూర్: మహిళా దినోత్సవం సందర్భంగా హృదయ భారతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మక్కపాటి మంగళ ఆధ్వర్యంలో బాల భారతి స్కూల్‌లో శుక్రవారం ఉపాధ్యాయురాళ్లు, ఆయాలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంగళ మాట్లాడుతూ.. మహిళలు సాధికారిత సాధించి ఆర్థిక అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ సంఘం అధ్యక్షులు కపిర్తేశ్వర్‌రావు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

నియామకం



షేక్‌కు నియామక పత్రం అందజేస్తున్న నందికంటి శ్రీధర్

గౌతంనగర్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం గౌతంనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా జేఎల్ఎన్ఎస్‌నగర్‌కు చెందిన షేక్‌ను నియమిస్తూ మల్కాజిగిరి మైనార్టీ సెల్ చైర్మన్ మహమ్మద్ ఆలీతో కలిసి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలని కోరారు. తనకు పదవి దక్కేందుకు కృషి చేసిన మల్కాజిగిరి సర్కిల్ ఏ బ్లాక్ అధ్యక్షులు టి. వెంకటేష్ యాదవ్‌తోపాటు పార్టీ పెద్దలకు షేక్ కృతజ్ఞతలు తెలిపారు.

ఏళ్లు గడుస్తున్నా.. ఎదురుచూపులేనా?



నగర శివారు పురపాలికలు, పంచాయతీల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 3.85 లక్షలు

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నుంచి 1,43,927 దరఖాస్తులు
- దాదాపు రెండున్నరేళ్ల క్రితం స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల స్వీకరణ
- సిబ్బంది కొరతతో ముందుకుసాగని పరిశీలన ప్రక్రియ
- లబ్ధిదారులకు తప్పని నిరీక్షణ

సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారుల్లోని పురపాలికలు, గ్రామ పంచాయతీల్లో ఎస్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణకు మోక్షం లభించడం లేదు. ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోకపోవడంతో దరఖాస్తుదారులు నిరీక్షిస్తున్నారు. 2020 అక్టోబర్‌లో స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హతలున్న స్థలాలకు ఆమోదం తెలుపుతామని పేర్కొన్న సర్కారు.. నేటికీ ఆ ప్రక్రియ ముందుకు తీసుకెళ్లడం లేదు. ఏళ్లుగా అనధికారికంగా ఉన్న ప్లాట్లు, లేఅవుట్లు క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ఎస్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)ను తీసుకొచ్చింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం ఇస్తామని బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. దీంతో ఎల్ఆర్ఎస్ కింద దరఖాస్తు చేసుకున్న వారందరు ప్రభుత్వ ఆమోద ముద్ర కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

తప్పని నిరీక్షణ...

నగర శివారు జిల్లాలోని 29 పురపాలికల్లో ఎస్ఆర్ఎస్ కింద 3,85,674 దరఖాస్తులు వచ్చాయి. తొలివిడత ఫీజు రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తులు స్వీకరించారు. మిగతా ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సి ఉన్నా.. ఈ ప్రక్రియకు మోక్షం లభించకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం ప్రకటించిన నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ కింద అనుమతి వస్తే భవనం నిర్మాణం చేపట్టడం, బ్యాంకు రుణాలు తీసుకోవాలని ఆశతో ఉన్న వారికి నిరాశే మిగులుతోంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

క్రమబద్ధీకరణ క్రతువును టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్(టీపీబీఓ)లు చేపట్టాల్సి ఉంటుంది. వీరి తర్వాత టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ (టీపీఎస్) పరిశీలిస్తారు. ఆ తర్వాత టీపీఓ, కమిషనర్ అనుమతి మంజూరు చేస్తారు. కానీ తొలి, మలి ప్రక్రియ చేపట్టడానికి సిబ్బంది చాలా తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి రెండు జిల్లాలోని 29 పురపాలికల్లో ఈ విభాగంలో ఉద్యోగులు సరిపడా లేకపోవడం, ఉన్న వారికి వారానికి ఒక్కరోజు, రెండ్రోజులు మాత్రమే విధులు కేటాయిస్తుండటంతో వేల సంఖ్యలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించడం కష్టమవుతోంది.

భారీగా దరఖాస్తులు...

తెలంగాణ రాష్ట్రంలో మొత్తంగా 25 లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రాగా, నగర శివారు జిల్లాలైన మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డిల పరిధిలోని 7 కార్పొరేషన్లు, 21 మున్సిపాలిటీలు, 297 గ్రామ పంచాయతీల నుంచి మొత్తం 3,85,674 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 29 పురపాలక సంఘాల నుంచి 3,74,447 దరఖాస్తులు రాగా, 297 గ్రామ పంచాయతీల నుంచి 11,227 దరఖాస్తులు వచ్చాయి. ముఖ్యంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలతో సహా 51 గ్రామ పంచాయతీల పరిధిలో 1,43,927 దరఖాస్తులు అందాయి. అదేవిధంగా రంగారెడ్డి జిల్లాలోని 3 మున్సిపల్ కార్పొరేషన్లు, 12 మున్సిపాలిటీలతో పాటు 246 గ్రామ పంచాయతీ పరిధిలో 2,41,747 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి.



ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ కాకతీయనగర్ శ్రీమహంకాళి, శ్రీరామ దేవాలయంలో జరుగుతున్న ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు, శ్రీ సీతారామచంద్రస్వామి తిరు కల్యాణ మహోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం హబ్సిగూడలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ మాజీ చైర్మన్ గాయం శ్రీధర్‌రెడ్డి, అర్చకులు గట్టు శ్రీనివాసచార్యులు, మల్లిఖార్జున శాస్త్రి, శ్రీనివాసాచారి, బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, భాస్కర్ ముదిరాజ్, లక్ష్మీనారాయణ, ప్రదీప్‌రెడ్డి, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

హబ్సిగూడ: ఉప్పల్ డివిజన్ దేవేందర్‌నగర్ కాలనీలో నెలకొన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కాలనీవాసులు హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు జీనత్‌బేగం, పద్మారెడ్డి, రేణుక, సంతోష, మల్లేశ్వరి, స్వరూప, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ భగాయత్ ప్లాట్ ఓనర్స్ ఆధ్వర్యంలో...

ఉప్పల్ భగాయత్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కలిసి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి కనెక్షన్లపై వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ కన్వీనర్ మేకల మధుసూదన్‌రెడ్డి, ముఖ్య సలహాదారులు గోనే అర్జున్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, వినోద్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్



నగదు అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

కాప్రా: కుషాయిగూడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిజాయితీని చాటుకున్నాడు. బస్సులో ఓ వ్యక్తి పోగొట్టుకున్న సొమ్మును తిరిగి అతడికి అప్పగించాడు. కుషాయిగూడ డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఎస్వీఆర్ రెడ్డి విధి నిర్వహణలో భాగంగా కుషాయిగూడ నుంచి ఒంగోలుకు వెళుతున్నాడు. మార్గ మధ్యలో మిర్యాలగూడ వద్ద పాప్‌కార్న్ అమ్ముకునేందుకు బస్సులోకి ఎక్కిన బాలకృష్ణ అనే వ్యక్తి నగదు ఉన్న బ్యాగును బస్సులోనే మరిచిపోయాడు. దీనిని గుర్తించిన బస్సు డ్రైవర్ ఎస్వీఆర్ రెడ్డి తిరుగు ప్రయాణంలో మిర్యాలగూడ డిపోలో ఆరా తీసి బాధితుడిని గుర్తించాడు. మిర్యాలగూడ డిపో సిబ్బంది శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, కృష్ణ సమక్షంలో బాలకృష్ణకు రూ. 12,300 అందజేశాడు. పోయిన సొమ్ము తిరిగి దక్కడంతో అతను ఎస్వీఆర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపాడు. నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్‌ను స్థానికులు అభినందించారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన

మల్లాపూర్: ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(డీఆర్ఎఫ్) ఈసీఐఎల్ విభాగం ఇన్‌స్పెక్టర్ సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం మల్లాపూర్ బ్రహ్మపురి కాలనీ శ్రీకరి మహాసన హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. భూకంపాలు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సాయి బాబా, సెక్రటరీ రాధా కృష్ణ శర్మ, ప్రిన్సిపాల్ శేనాయ్ పర్కల్, డీఆర్ఎఫ్ వెహికల్ ఇన్‌చార్జి ఎస్ఎఫ్ఓ వెంకన్న పాల్గొన్నారు.

అంధత్వ నివారణకే కంటి వెలుగు

ఘట్‌కేసర్: రాష్ట్రంలో అంధత్వం పారదోలేందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. మున్సిపాలిటీలోని 12వ వార్డులో మున్సిపల్ కమిషనర్ వేమనరెడ్డితో కలిసి శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కౌన్సిలర్ పద్మారావు, పీహెచ్ఎన్ విమలరెడ్డి, అప్తమాలజిస్ట్ శిరీష, డీఈఓ సాత్విక్, వైద్యసిబ్బంది విజయ, రాజేశ్వరీ, లక్ష్మీ, మేఘమాల పాల్గొన్నారు.

'టెక్నో ఫెస్ట్'తో ప్రతిభకు పదును



ఘట్‌కేసర్: యువ మేధస్సులోని ప్రతిభను ఆవిష్కరించడం టెక్నో లక్ష్యమని హైదరాబాద్ హిటాచీ వంటారా టాలెంట్ అక్విజిషన్ మేనేజర్ నిడమర్తి ప్రశాంత్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో జాతీయ స్థాయి టెక్నో ఫెస్ట్ దక్ష 2కె23 ముగింపు కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయి టెక్నోలు విద్యార్థులు సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయన్నారు. అనంతరం టెక్నికల్, నాన్ టెక్నికల్ ఈవెంట్ల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపకులపతి రాంచంద్రం, రిజిస్ట్రార్ సమీనా ఫాతిమా, సీఈఓ నీలిమా, కన్వీనర్ అనిల్ కుమార్, కోకన్వీనర్ రవిరాజు, ఏయూ హెడ్‌లు, డీన్స్, హెచ్ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

28న బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక

అల్వాల్: ఈ నెల 26న మల్లాపూర్‌లోని వీఎస్ఆర్ గార్డెన్స్‌లో కల్యాణ భారతి ఆధ్వర్యంలో 9వ రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. 26న ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరిచయ వేదిక కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ నెల 15లోగా ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు www.kalyanabharathi.comలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

నియామకం



గౌతంనగర్: మల్కాజిగిరి సర్కిల్ గౌతంనగర్‌కు చెందిన బలిజేల్లి వెంకటకిశోర్‌ను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ హైదారాబాద్ అడ్వైజరీ ప్యానెల్ సభ్యులుగా నియమిస్తూ ఇటీవల నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వెంకటకిశోర్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహిస్తానని తెలిపారు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

అల్వాల్: చిన్నారిని చితక బాదిన ఉపాధ్యాయుడిపై కేసు నమోదైన సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాఖాజీగూడ మానస సరోవర్‌లోని ప్లే స్కూల్‌లో చదువుతున్న విద్యార్థిని(4) ఉపాధ్యాయుడు శుక్రవారం చితకబాదాడు. చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చైన్ స్నాచర్ల అరెస్ట్

అల్వాల్: గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అల్వాల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్వాల్ పీఎస్ పరిధిలోని పంచశీల కాలనీలో ఈ నెల 2న ముగ్గురు యువకులు మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లేందుకు యత్నించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులు మహారాష్ట్రకు చెందిన అవినాష్ సునీల్, స్వప్నీల్ సుదేష్ , శివరాజ్ సంజయ్‌లుగా గుర్తించారు. శుక్రవారం వారిని అరెస్టు చేసి బంగారు గొలుసుతో పాటు చోరీకి ఉపయోగించిన పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.



కేటీఆర్‌తో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి

మేడిపల్లి:బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ పార్లమెంటరీ, లెజిస్లేటివ్ పార్టీ, రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశంలో పాల్గొన్న పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



హెల్త్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న మేయర్ జక్కా వెంకట్ రెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో కేర్ హెల్త్ ఇన్సూరెన్స్, ఎస్ఎస్ఆర్ ఎంటర్ ప్రైజెస్ ఆధ్వర్యంలో యూపీహెచ్‌సీ, యుక్త హాస్పిటల్ వారి సౌజన్యంతో మున్సిపల్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, కమిషనర్ రామకృష్ణారావుతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్యసమస్యలు తలెత్తిన తక్షణమే పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈ హెల్త్‌క్యాంపులో సమారు 170 మందికి రక్తపరీక్షలు చేశారు. బీపీ, షుగర్, ఎస్‌పిఓటు, ఈసీజీ పరీక్షలతో పాటు వివిధ రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొడె పోచయ్య, సుభాష్ నాయక్, మేనేజర్ జ్యోతి, శానిటరి ఇన్‌స్పెక్టర్ జానకి, యుక్త హాస్పిటల్ యండీ సత్యం, రాజేందర్, ప్రతిక, రాజేష్, ఖాజఖాన్, రాజు.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నియోజకవర్గానికి చెందిన సుజాతకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.42,500 చెక్కును ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన పేదలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, రఘుపతిరెడ్డి, భాస్కర్ ముదిరాజ్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

పైప్‌లైన్లకు మరమ్మతులు చేపడతాం



ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్న దృశ్యం

బోడుప్పల్: పగిలిపోయిన పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టి కాలనీ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని 13వ డివిజన్ కార్పొరేటర్ దానగల్ల అనిత యాదగిరి అన్నారు. దేవేందర్‌నగర్ ఫేస్ 2 పైప్‌లైన్ పగిలిపోవడంతో గత 10 రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో కాలనీ వాసులు సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆమె స్పందిస్తూ 5 ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపడతామన్నారు. అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



దీక్షలో పాల్గొన్న మహిళలు

బోడుప్పల్: వక్ఫ్ బోర్డు బాధితుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో బోడుప్పల్ అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన రిలేనిరాహార దీక్షలు శుక్రవారం 13వ రోజుకు చేరాయి. బీజేపీ నేతలు కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, గోనె శ్రీనివాస్, కూరపాటి విజయకుమార్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో 7 వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. శుక్రవారం దీక్షలో శ్రావణి, శ్యామల, సంగీత, ఘన కుమారి, సుగుణవతి తదితరులు పాల్గొన్నారు.

దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలి



దళిత హక్కుల పోరాట సమితి మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అల్వాల్: దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని దళిత హక్కుల పోరాట సమితి మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే. సహదేవ్ అన్నారు. శుక్రవారం యాప్రాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై దాడులు నానాటికి పెరిగిపోతున్నాయన్నారు. దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాల మేరకు బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందని ఆరోపించారు. ఈ దాడులను దళిత హక్కుల పోరాట సమితి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అనంతరం మార్చి 31న హైదరాబాద్‌లో నిర్వహించనున్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రథమ మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

శుభాకాంక్షలు



చంద్రశేఖర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న గడ్డం రవికుమార్

హబ్సిగూడ: బీఆర్ఎస్ సీనియర్ నేత కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్ర అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం రవికుమార్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆయన సతీమణి అరుణ, కుమార్తెలు నాగలక్ష్మీరెడ్డి, అల్లు స్నేహారెడ్డి, మురళీరెడ్డి, మేడి పాపన్న, రోహిత్ రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ ఫుల్

- అక్రమ పార్కింగ్ అడ్డాగా ఉప్పల్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం

ఉప్పల్: ఉప్పల్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో పార్కింగ్ అడ్డాగా మారింది. కనీసం ఫిర్యాదుల కోసం వచ్చిన వారు కానీ, సిబ్బంది ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు అవకాశం లేకుండా స్థానికులు సర్కిల్ కార్యాలయ ప్రాంగణంలో వాహనాలు పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలను అక్కడే నిలిపివేస్తుండటంతో స్థానిక సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు, టాక్స్ చెల్లించేందుకు వచ్చే వారు తమ వాహనాలను ఎక్కడ నిలపాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్టవేయాలని కోరుతున్నారు.



ఉప్పల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో పార్కు చేసిన ద్విచక్ర వాహనాలు